కేటాయించారు.. పొమ్మన్నారు

- అధికారులను నిలదీసిన బస్వాపూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు
- బలవంతంగా బయటకు పంపిన అధికారులు
- రోదిస్తూ ఇళ్లను ఖాళీ చేసిన లబ్ధిదారులు


అధికారులతో లబ్ధిదారుల వాగ్వాదం


బస్వాపూర్‌లో డబుల్ బెడ్ రూం లబ్ధిదారులను ఖాళీచేయాలని ఆదేశిస్తున్న అధికారులు

భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్, సిద్దరామేశ్వనగర్ గ్రామాల్లో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నుంచి లబ్ధిదారులను అధికారులు, పోలీసుల సహాయంతో మంగళవారం ఖాళీ చేయించారు. నిరుపేదలమైన తమకు గత ప్రభుత్వం హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయిస్తే ప్రస్తుతం అధికారులు పోలీసుల సహకారంతో తమను ఉన్నపళంగా వాటి నుంచి ఖాళీ చేయించడం ఎంతవరకు సబబని వారు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని మిగితా గ్రామాల్లోని లబ్ధిదారులను వదిలేసి కేవలం తమను మాత్రమే వెళ్లగొట్టడమేమిటని వారు ఆవేదన చెందారు. వివరాలిలా ఉన్నాయి. బస్వాపూర్ గ్రామంలో కేసీఆర్ హయాంలో 50 డబుల్ బెడ్‌రూములను పెద్ద మల్లారెడ్డి వెళ్లేదారిలో నిర్మించారు. ఈ నిర్మాణం జరగనప్పుడు, ప్రస్తుతం శ్రీ సిద్దరామేశ్వరనగర్‌గా పేరు మారిన భిక్కనూరు రైల్వేస్టేషన్ గ్రామం బస్వాపూర్ జీపీ పరిదిలో కొంత భాగం భిక్కనూరు జీపీ పరిధిలో కొంతబాగం ఉండేది. తదుపరి భిక్కనూరు రైల్వేస్టేషన్ గ్రామం జీపీగా మారడంతో భిక్కనూరు రైల్వేస్టేషన్ శ్రీ సిద్దరామేశ్వరనగర్‌గా పేరు మారింది. అనంతరం ఇళ్లు లేని నిరుపేదల కోసం గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంల నిర్మాణాల్లో భాగంగా పెద్దమల్లారెడ్డికి వెళ్లే దారిలో 50 ఇళ్లను నిర్మించింది. అనంతరం గ్రామసభలు ఏర్పాటుచేసి బస్వాపూర్‌నకు చెందిన 41 మందికి, శ్రీసిద్ద రామేశ్వరనగర్‌కు చెందిన 9 మందిని ఎంపిక చేశారు.

అప్పటి కలెక్టర్ ఉత్తర్వులిచ్చినప్పటికీ..

అప్పటి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఈ 50 మందికి ఇళ్లను కేటాయిస్తూ గతేడాది అక్టోబర్ 7వ తేదీన ఉత్తర్వులిచ్చారు. అధికారులు ఈ విషయాన్ని జీపీ నోటీస్ బోర్డులపై అతికించారు. తమకు కేటాయించిన ఇళ్లకు నంబర్లు ఇవ్వాలని కోరగా వారు చర్యలు తీసుకునే లోపే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో అధికారులు నంబరింగ్ ఇవ్వలేదు. ఉండటానికి ఇళ్లు లేకపోవడం అకాల వర్షాల కారణంగా లబ్ధిదారులు అనధికారికంగా ఇళ్లలోకి ప్రవేశించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత నంబర్లు ఇవ్వాలని కోరగా అధికారులు పట్టించుకోలేదు. కాని అనధికారికంగా ఉంటున్నారని పేర్కొంటూ అదే అధికారులు పోలీసుల సాయంతో లబ్ధిదారులందరికీ బయటికి పంపారు. ఇళ్లకు తాళాలు వేయించారు. అంతలోనే మళ్లీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చింది. లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయి మళ్లీ అనధికారికంగా ఇళ్లలోకి వెళ్లారు. అధికారులు పోలీసులు వచ్చి మళ్లీ లబ్ధిదారులను ఖాళీ చేయించి కలెక్టర్ దగ్గరకు తీసుకెళ్తామని చెప్పారు. దీంతో లబ్ధిదారులు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వద్దకు వెళ్లి తమ ఇక్కట్లను సీసీని వినతిపత్రం రూపంలో అందజేశారు. అయినా నంబర్లు ఇవ్వలేదు. వానలు జోరుగా కురుస్తుండటంతో మళ్లీ లబ్ధిదారులు డబుల్ ఇళ్లలోకి ప్రవేశించారు. మంగళవారం ఆర్డీవో రంగనాథ్‌రావు, భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌తో పాటు మరికొందరూ అధికారులు పోలీసులు ఈ డబుల్‌బెడ్‌రూమ్‌ల వద్దకు వెళ్లి ఖాళీచేయాలని లబ్ధిదారులను బలవంతం చేశారు. ప్రభుత్వం తమకు కేటాయించినట్లుగా ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అధికారులు ఇలా చేయడం తగదని వారు విన్నవించినా పోలీసులు అధికారులు వినిపించుకోకుండా లబ్ధిదారులు సామన్లను ఇళ్ల బయట పెట్టించి ఇళ్లను ఖాళీ చేయించగా లబ్ధిదారులు రోదిస్తూ ఇళ్లను ఖాళీ చేసి వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు.

క్లుప్తంగా

సర్వీస్ రోడ్డు లేకుండా విస్తరించాలి



నిజాంసాగర్(జుక్కల్) : సర్వీస్ రోడ్డు లేకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, వ్యాపార సముదాయాలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ మంగళవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో వ్యాపారస్తులు తహసీల్దార్ సవాయిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్–బోధన్ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో రోడ్డుకు రెండువైపులా 45 ఫీట్ల చొప్పున విస్తరించాలన్నారు. 50ఫీట్ల చొప్పున విస్తరణ చేస్తే దుకాణాలు మిగలవన్నారు. అలాగే సర్వీస్ రోడ్డు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ వ్యాపారస్తులు జక్సాని శ్రీనివాస్, విజయ్, విక్రాంత్ తదితరులున్నారు.

ఇస్కాన్ కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడ : ఈనెల 4న ఇస్కాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు కామారెడ్డి ఇస్కాన్ ప్రతినిధి వెంకటదాసు ప్రభు అన్నారు. మంగళవారం సరస్వతి ఆలయంలో ఇస్కాన్ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు, భగవద్గీత 12వ ఆధ్యాయ శ్లోకాల పఠనం, సంప్రదాయ దుస్తులపై పోటీలు నిర్వహించనున్నట్లు అన్నారు. విజేతలకు ఎమ్మెల్యే పోచారం బహుమతులు అందజేస్తారన్నారు. కర పత్రాల ఆవిష్కరణలో ఇస్కాన్ ప్రతినిధులు మల్లికార్జున్, నాగరాజు, అరవింద్ తదితరులున్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు కళాజాత బృందం ద్వారా పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సమాజంలో సైబర్ క్రైం గురవుతున్న వారిని చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జి ప్రభాకర్, శేషారావు, పోలీసులు సాగర్ గౌడ్ తదితరులున్నారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉండొద్దు



బాన్సువాడ రూరల్ : శిథిలావస్థకు చేరి, కూలిపోడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో నివాసం ఉండరాదని బోర్లం జీపీ కార్యదర్శి సాయికుమార్ సూచించారు. గ్రామంలో కురిసిన వర్షంతో ఇళ్లు కూలిపోయిన బాధితురాలు నల్లోల్ల సాయవ్వను పరామర్శించారు. తాత్కాలికంగా ప్రభుత్వ పాఠశాలలో ఉండాలని సూచించగా ఆమెను తమ బంధువుల ఇంట్లో ఉండటానికి అనుమతించారు. సీనియర్ కారోబార్ సయ్యద్ జాఫర్ ఉన్నారు.

ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



దోమకొండ : ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో.నం 60 ప్రకారం వేతనాలు పెంచాలని కోరుతూ చేపట్టిన నిరసన కార్యక్రమం మంగళవారం 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆరోగ్యమిత్ర మధుసూదన్ మాట్లాడారు. ఆరోగ్య మిత్రలకు డీపీవో క్యాడర్ కల్పించి ఉద్యోగ భద్రత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఆరోగ్యమిత్రలు జనని, రాణి, తిలోత్తమ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల కోసం దరకాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీలలో ఒక్కో పోస్టు ఉందన్నారు. అలాగే బాటనీ, హిస్టరీ, జువాలజీ సబ్జెక్టులలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల వారు 5వ తేదీ వరకు ధరకాస్తు చేసుకోవాలని కోరారు. కనీసం 55 శాతం మార్కులు ఉండాలని, ఇంటర్వ్యూలు 6వ తేదీన ఉంటాయన్నారు.

ఆధ్యాత్మికం

అయ్యప్పస్వామికి అభిషేకాలు, విశేషపూజలు



కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న శ్రావణ మాస అభిషేకాల ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. హరీష్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు అయ్యప్పస్వామికి అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, అన్నప్రసాద సేవా కమిటీ ప్రతినిధులు అందె శ్రీనివాస్, పట్నం రమేష్, గోనే శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా ఎడ్లపొలాల పండుగ



బాన్సువాడ రూరల్ : మండలంలోని కోనాపూర్ గ్రామంలో మంగళవారం ఎడ్లపొలాల అమావాస్య పండుగ నిర్వహించారు. రైతులు ఎడ్లను అందంగా అలంకరించి గ్రామంలోని హనుమాన్ మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

పెద్దకొడప్‌గల్‌లో..



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని బేగంపూర్, కాస్లాబాద్, వడ్లం, కాటేపల్లి, గ్రామలల్లో ఎడ్ల పొలాల అమావాస్య ఘనంగా జరుపుకున్నారు. బసవన్నలకు అందంగా ముస్తాబు చేసి వాటికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస ముగింపు ఉత్సవాలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలోని పలు తండాల్లో మంగళవారం శ్రావణమాస ముగింపు ఉత్సవాలను నిర్వహించారు. మండలంలోని కట్టకింది తాండా, హాజీపూర్, జాన్కంపల్లి తాండాలలో శ్రావణమాస ముగింపులో భాగంగా జగదంబా, సేవాలాల్ మహరాజ్ ఆలయాల వద్ద భోగ్‌భండార్ నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన మహిళలు, తాండా పెద్దలు తదితరులున్నారు.

నాగిరెడ్డిపేటలో..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : శ్రావణమాసంను పురస్కరించుకొని నెలరోజులపాటు ప్రతి మంగళవారం గిరిజన మహిళలు చేపట్టిన ఉపవాసదీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేట మండలంలోని బంజార, ధర్మారెడ్డి, మెల్లకుంట, బెజుగంచెరువు, పల్లెబోగుడ తదితర తండాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజనులు కూడా ఆలయాలలో పూజలు చేశారు.

గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో 152 మంది విద్యార్థులకు సాధారణ పరీక్షలు చేశారు. వైద్యులు హరీష్ గౌడ్, దివ్యభారతీ, సిబ్బంది, హాస్టల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

భూములను కాపాడాలి



బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూములను కాపాడాలని మంగళవారం సబ్ కలెక్టర్ కిరణ్మయికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలోని కబ్జాకు గురైన కల్కి చెరువు శిఖం భూములు, పది శాతం భూములు, గ్రామ కంఠం భూములను కబ్జా గురయ్యాయన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ నాయకులు శంకర్‌గౌడ్, కోనాల గంగారెడ్డి, భూమేష్, ఆంజనేయులు ఉన్నారు.

హాస్టళ్లలో పరిశుభ్రత పాటించాలి


ఎల్లారెడ్డి మోడల్ కళాశాల హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్


తాడ్వాయిలోని గురుకుల పాఠశాలలో..


దోమకొండలోని బీసీ బాలుర వసతి గృహంలో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ కళాశాల వసతి గృహాన్ని ఆర్డీవో మన్నె ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. హాస్టల్‌లోని వసతి గదులను పరిశీలించిన అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. హాస్టల్‌లో వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు, సి బ్బందికి సూచించారు. ఎంపీవో ప్రకాష్, సిబ్బంది సుజాత, సులోచన తదితరులున్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం చేశారు. హాస్టల్ ఆవరణలో మొక్కలను నాటారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి,ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శిరీష ఉన్నారు.

దోమకొండ : విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి జ్యోతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. వసతిగృహం వార్డెన్ స్వామితో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. గదుల్లో వర్షాలకు పెచ్చులూడితే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సంఘమేశ్వర్‌లోని అంగన్‌వాడీని తనిఖీ చేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈవోలు రమేష్, వసంత తదితరులు ఉన్నారు.

కూలిన ఇళ్ల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామంలో పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించి గ్రామంలోని పలుకాలనీల్లో ఆయన పర్యటించారు. కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలు ఉండొద్దన్నారు. జీపీలో రిక్డార్డులను తనిఖీ చేశారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సృజన్‌కుమార్ సూచించారు. నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన ఆశవర్కర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. జ్వరం వస్తే ఇంటికే వెళ్లి మాత్రలివ్వాలని, ప్రభుత్వాస్పత్రుల్లోనే గర్భిణీలు డెలివరీ అయ్యేలా చూడాలన్నారు. సూపర్‌వైజర్లు సుభాషిణి, సునంద తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు గురైన పంటల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మంజీరనది వరదతో ముంపునకు గురైన పంటలను మంగళవారం మండల వ్యవసాయధికారి హరి వెంకటప్రసాద్ పరిశీలించారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాసాన్‌పల్లి, తాండూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి నీటమునిగిన పంటలను పరిశీలించారు. పోచారం ప్రాజెక్టు అలుగు పైనుంచి దిగువకు ప్రవహిస్తున్న నీటితోపాటు సింగూర్ నుంచి భారీగా వస్తున్న వరదనీటితో మంజీరనది ఉప్పొంగి ప్రవహిస్తుంది. మంగళవారం ఉదయం నాటికి నీరు వెనక్కి వెళ్లి పంటలు తేలాయని ఏవో తెలిపారు. ఆయనవెంట ఏఈవో దివ్య ఉన్నారు.


నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఏవో

జీపీ సిబ్బందికి రెయిన్ కోట్స్ పంపిణీ



భిక్కనూరు : మండల కేంద్రంలోని జీపీ కార్మికులకు సిబ్బందికి న్యాయవాది రెయిన్‌కోట్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. వర్షానికి కూడా లెక్కచేయకుండా జీపీ సిబ్బంది, కార్మికులు 28 మందికి రూ.40వేల విలువచేసే రెయిన్‌కోట్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో మహేష్‌గౌడ్, యువజన సంఘాల ప్రతినిదులు, బేతి రాజు, లక్ష్మణ్ తదితరులున్నారు.

అధ్వానంగా మిషన్ భగీరథ పైప్‌లైన్



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని భూంపల్లి–పద్మాజీవాడి గ్రామాల శివారులో గాంధారి–బాన్సువాడ ప్రధాన రహదారి పక్కన ఉన్న మిషన్ భగీరథ ఓవర్ ఫ్లో పైప్‌లైన్ పూర్తిగా మురికి కూపంగా మారింది. దీంతో నీరు కలుషితమై రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి ఓవర్ ఫ్లో పైప్‌లైన్ వద్ద మురికిని తొలగించాలని గ్రామీణులు కోరుతున్నారు.

మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట : మండలంలో పాక్షికంగా ఇళ్లు దెబ్బతినడంతో పాటు పంటలు నీట మునిగినట్లు గుర్తించినట్లు మండల తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నిర్వహించిన వీసీలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో 11 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. మండలంలో ఎప్పటికప్పుడు రోడ్ల, ధ్వంసం, చెరువు కట్టల పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. శివాయిపల్లి గ్రామ పరిధిలో రైల్వే బ్రిడ్జిలో నీరు భారీగా నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయని ప్రయణికులు ఈ విషయాన్ని గమనించాల్సిందిగా కోరారు. ఎంపీడీఓ కె రాజేశం, ఎంపీ రఘురాం పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

వరద బాధితులకు పునరావాసం


జుక్కల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్


రామేశ్వర్‌పల్లిలో వరద బాధితులకు భోజన ఏర్పాట్లు


ఎల్లారెడ్డిలో నిత్యావసరాలు అందిస్తున్న కౌన్సిలర్లు

నిజాంసాగర్(జుక్కల్) : నాలుగు రోజుల నుంచి కుండపోతగా కురుస్తున్న వర్షాలకు ఇళ్లు కూలడం, పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన బాధితులకు అధికారులు పునరావాసం కల్పిస్తున్నారు. మంగళవారం జుక్కల్, మహమ్మద్ నగర్ మండలాల్లోని బాధిత కుటుంబాలను మండల పరిషత్, రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు.

భిక్కనూరులో..

భిక్కనూరు : రామేశ్వర్‌పల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూముల్లో నివసిస్తూ వరద వల్ల నిరాశ్రయులైన వారికి ప్రభుత్వ నిధులతో ఆహారాన్ని అందిస్తున్నట్లు తహసీల్దార్ శివప్రసాద్ మంగళవారం తెలిపారు. అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులిచ్చామన్నారు. తాత్కాలికంగా వారికి నివాసం ఏర్పాట్లు చేశామన్నారు. ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఆర్ఐ బాలయ్య, జీపీ కార్యదర్శి కార్యదర్శి ప్రశాంత్, జూ. అసిస్టెంట్లు స్వామి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి) : పట్టణంలోని రిక్షా కాలనీలో ఇళ్లు కూలిన బాధితులకు మున్సిపల్ కౌన్సిలర్లు మంగళవారం నిత్యావసర సరుకులను అందించారు. రిక్షా కాలనీకి చెందిన నలుగురి కుటుంబాల ఇళ్లు కూలడంతో వారికి పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వసతి కల్పించారు. కౌన్సిలర్లు నీలకంఠం, శ్రీకాంత్, రాము, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, శ్రీనివాస్ తదితరులున్నారు.

సంక్షిప్తం

5న గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం

ఎల్లారెడ్డి : ఈనెల 5న గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్సై మహేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు గణేశ్ మండపాల నిర్వాహకుల సమావేశం ఉందన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా తిరుమల ప్రసాద్



నిజాంసాగర్(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయానికి ప్రత్యేకాధికారిగా వచ్చిన తిరుమల ప్రసాద్‌ను మంగళవారం మండల అధికారులు సన్మానించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా ఉన్న తిరుమల ప్రసాద్‌ను మండల ప్రత్యేక అధికారిగా నియమించారు. ఈ మేరకు వచ్చిన ప్రత్యేక అధికారి మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వెంట ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో అనిత తదితరులు ఉన్నారు.

8న భారత్ కిసాన్ సంఘ్ విస్తృత స్థాయి సమావేశం

కామారెడ్డి అర్బన్ : భారత్ కిసాన్ సంఘ్(బీకేఎస్) జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు స్థానిక సరస్వతి విద్యా మందిర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు బీకేఎస్ ప్రతినిధి విఠల్‌రెడ్డి తెలిపారు.

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది




సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని తిర్మన్‌పల్లిలో కూలిన ఇళ్లను సోమవారం తహసీల్దార్ గంగాసాగర్ పరిశీలించారు. అలాగే మర్కల్ గ్రామంలో లింగం నివాసపు గుడిసె పూర్తిగా చెల్లించేవరకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం తరపున వచ్చే లబ్ధిని అందజేస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగారెడ్డి తదిలరులు పాట్టారు.

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై గుండెపోటుతో మరణించిన రాటో డ్రైవర్ బేతాళస్వామి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని అటో జేఏసీ జిల్లా అధ్యక్షుడు బోదాసు నర్సింలు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఆదుకోవాలని కోరారు.

వంతెనకు మరమ్మతులు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలో అన్నారెడ్డికి వెళ్లే రోడ్డుపై ఉన్న లోలెవల్ వంతెన వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో కోమట్‌పల్లి అన్నారెడ్డిపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపీడీవో నరేష్ స్పందించి అన్నారెడ్డిపల్లికి చేరుకొని కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. జేసీబీ, ట్రాక్టర్లతో మొరం వేసి మరమ్మతులు చేయించారు.

బాధితులకు సరుకుల పంపిణీ

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని నల్లమడుగులో ఇల్లు కూలిన బాధితులకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫియోద్దీన్ సరుకులు అందజేశారు. బాధితులకు ఇల్లు కూలి నిరాశ్రయులు కావడంతో ప్రాథమిక పాఠశాలలో పునరావాసం కల్పించారు.